రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# ఫిర్యాదుదారులకు న్యాయం అందించాలనే లక్ష్యంతో పని చేయాలి

**-జిల్లా ఎస్పీ కోటిరెడ్డి**



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పి ఎన్.కోటిరెడ్డి

**దౌల్తాబాద్,నవంబర్ 23,ప్రభాతవార్త:**

సాధారణ తనికిల్లో భాగంగా వికారాబాద్ జిల్లా దౌల్లాబాద్ పోలీస్ స్టేషన్‌ను బుధవారంరోజు జిల్లా ఎస్‌పి ఎన్.కోటిరెడ్డి సంధర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశిలించి పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ...పోలీస్ అధికారులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని,ముందుచూపుతో పనిచేసి అధికారులు ఎలాంటి కేసులు పెండింగ్ లో లేకుండా చూడాలని అన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాధుల పట్ల మర్యాదగా ఉండాలని, పోలీస్ అధికారులు పిర్యాదుదారులకు న్యాయం అందించాలి అనే లక్ష్యంతో పని చేయాలని అన్నారు. అనంతరం జిల్లా ఎస్‌పి పోలీస్‌స్టేషన్ నందు నమోదు అయిన కేసుల వివరాలను, పెండింగ్‌లో ఉన్నటువంటి కేసుల గురించి అడిగి సూచనలు ఇచ్చారు. అనంతరం దౌల్లాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల యాంకి గ్రామంలో జరిగిన మర్డర్ కేసు యొక్క సంఘటన స్థలాన్ని పరిశీలించి బాదిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇట్టి కేసు పట్ల ప్రత్యేకమైన టీమ్‌లు ఏర్పాటు చేసి వెంటనే కేసును చేదించాలని పరిగి డిఎస్‌పి కరుణాసాగర్‌రెడ్డికి జిల్లా ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి డిఎస్‌పి కరుణాసాగర్‌రెడ్డి, కొడంగల్ ఇన్స్పెక్టర్ శంకర్, దౌల్తాబాద్ ఎస్‌ఐ రమేష్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**-సిసి రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి**

**కొడంగల్,నవంబర్ 23ప్రభాతవార్త**

కొడంగల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంబించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు నూతనంగా ఏర్పడిన కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి గాను ఇదివరకే రూ.15కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం అదనంగా మరో రూ.10 కోట్ల మంజూరీతో వార్డుల్లో నెలకొన్న ప్రధాన సమస్యలైన రోడ్లు, త్రాగునీరు, మురుగుకాల్వల నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీశాఖ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు నిధులు పుష్కలంగా మంజూరీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టడంతో వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అంతేగాక మున్సిపల్ పరిధిల్లో వార్డుల వారిగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇందుకుగాను ప్రణాళికా బద్దంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చెర్మెన్ జగదీశ్వర్ రెడ్డి, వైస్‌చెర్మెన్ ఉషారాజేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు మధుసుదన్‌యాదవ్, ప్రభాకర్‌గౌడ్, పీఏసీఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త, విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు సయ్యద్ అంజద్, పకీరప్ప, చాంద్‌పాషా, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, నవాజోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## పోడు భూములపై గ్రామ సభ

**కొడంగల్ రూరల్, నవంబరు 23 (పభాతవార్త):**



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో

మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో బుధవారం పోడు భూములపై ఎంపీడీవో పాండు, డిప్యూటీ తహసీల్దార్ గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ గీతాఠాగూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో వారు మాట్లాడుతూ పోడు భూములకు సంబంధించి 44 మంది దరఖాస్తులు చేసుకోగా 13 మందికి వర్తిస్తుందన్నారు. పోడు భూములకు సంబంధించిన పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందించాలని వారు సూచించారు. పోడు భూముల కోసం ఎస్టీలు 2005 సంవత్సరం నుంచి కాస్తులో ఉండాలని, ఎస్సీ, బీసీ, మైనార్టీలు 75 సంవత్స రాల ముందు కబ్జాలో ఉంటే వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, లబ్ధిదా రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పది బస్సులు వస్తే పట్టవు




అరకొర ప్లాట్‌ఫాంలతో ఆమనగల్లు బస్టాండ్



స్థల కొరతతో అడ్డగోలుగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

**☛ఇదీ ఆమనగల్లు బస్టాండ్ తీరు ☛ఆదాయం పేరుతో ఆర్టీసి అధికారుల కక్కుర్తి ☛ఇరుకు బస్టాండ్‌లో దుకాణాలు ఏర్పాటు**

**☛విస్తరణ లేక ప్రయాణికుల అవస్థలు ☛రోజు రోజుకు పెరిగిపోతున్న బస్సుల సంఖ్య ☛వేధిస్తున్న క్యాంటీన్, తాగునీటి కొరత**

**ఆమనగల్లు, నవంబర్23, ప్రభాతవార్త:**

అద్దెలకిచ్చి ఆదాయం పెంచుకోవడంపై ఉన్న మక్కువ ఆర్టీసి అధికారులకు ప్రయాణికుల సౌకర్యాల కల్పనపై లేకుండా పోయింది. స్థాయికి మించి ఆదాయం సమకూరుస్తున్న పాలకులు, అధికారుల ఉదాసీనత వైఖరితో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధికి నోచుకోవడంలేదు. దశాబ్దాల క్రితం నాటి వసతులే నేటి అవసరాలు తీరుస్తుండడం ప్రజలకు శాపంగా మారింది. మారుతున్న కాలనుగుణంగా మార్పులు చేయవలసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో బస్టాండ్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చంధంగా మారింది. అద్దెల కోసం ఇరుకుగా మార్చిన బస్టాండ్ నేడు పట్టుమని పది బస్సులు పట్టలేని స్థితిని ఎదుర్కొంటున్నది. ఫ్లాట్‌ఫాంలు, క్యాంటీన్, త్రాగునీటి వసతి లేక ఆమనగల్లు బస్టాండ్ అవస్థల బస్టాండ్‌గా మారింది. వివరాలలోకి వెళితే...కల్వకుర్తి నియోజకవర్గంలోనే అతి పెద్ద పట్టణంగా పేరుగాంచిన ఆమనగల్లు పట్టణం మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలతోపాటు చుట్టు ప్రక్కల మండలాల ప్రజలకు ముఖ్య కేంద్రంగా విరజిల్లుతుంది. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాల నుండి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. దీంతో ఆమనగల్లు పట్టణం వచ్చిపోయే వారితో నిత్యం రద్దీగా దర్శనం ఇస్తుంటుంది. పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్టీసి బస్సుల ద్వారా ప్రయాణాలు సాగిస్తుంటారు. హైదరాబాద్, శ్రీశైలం, షాద్‌నగర్‌తోపాటు సుదూర ప్రాంతాలకు మిక్కిలిగా ప్రయాణాలు సాగిస్తుండడంతో ఆర్టీసికి ఆమనగల్లు బస్టాండ్ ఆదాయవనరులుగా మారింది. దాదాపు 3దశాబ్దాల క్రితం మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు అనుసంధానంగా ఉన్న స్థలంలో బస్టాండ్ ఏర్పాటు చేశారు. కాలక్రమంలో కల్వకుర్తి డిపో ఆవిర్భవించగా దాని పరిధిలో ఆమనగల్లు బస్టాండ్ ప్రయాణికులకు సేవలందిస్తున్నది. కాగా కల్వకుర్తి డిపోకే పరిమితం కాకుండా ఇతర డిపోలకు మంచి ఆదాయం సమకూరుస్తున్నది. ప్రస్తుతం అనేక డిపోల నుండి బస్సు సర్వీసులు నడుపుతూ ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరుస్తున్నది. దీంతో ఆమనగల్లు బస్టాండ్ ఎప్పుడూ బస్సులతో రద్దీగా దర్శనం ఇస్తుంటుంది. కాగా రోజురోజుకు పెరిగిపోతున్న బస్సు సర్వీసులతో బస్టాండ్ ఇరుకుగా మారింది. ఆర్టీసి అధికారులు ఆదాయం కోసం బస్టాండ్ ప్రహారి చుట్టూ షాపింగ్ కాంప్లేక్స్ నిర్మించడంతో ఉన్న కొద్దిపాటి స్థలం మరింతగా చిన్నదిగా మారింది. ప్రహారితోపాటు లోపలి స్థలాలను విభజించి వ్యాపారస్తులకు అద్దెకు ఇవ్వడంతో బస్టాండ్ స్థలం మరింత ఇరుకుగా మారింది. కాలనుగుణంగా విస్తరణ చేయాల్సిన ఆర్టీసీ సంస్థ అవకాశం ఉన్న ప్రతి స్థలాన్ని అద్దెలకు ఇచ్చుకుంటూ వస్తున్నది. బస్సుల సంఖ్య పెరిగిపోయి స్థలం మాత్రం సరిపోవడంలేదు. భవిష్యత్తులో ఇది మరింతగా ఇబ్బందులు కల్గించనున్నదంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఏకకాలంలో పది బస్సులు వచ్చి నిలుపుకునే పరిస్థితి లేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థల కొరత మూలంగా వచ్చిన బస్సులు వెంటనే వెళ్ళిపోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. దీంతో ప్రయాణికులు ఉన్నఫలంగా బస్సులు మిస్ చేసుకుని సమయానికి గమ్యం చేరుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ఎక్కడ ఏ బస్సులు ఆపుతున్నారో ఎవ్వరికి అర్థం కావడం లేదు. అంతా గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఇరుకు బస్టాండ్ ఇబ్బందులు సృష్టిస్తున్నది. కాలనుగుణంగా అభివృద్ధి పరచవలసి ఉన్నా నేటికి ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. దీంతో దశాబ్దాల నుండి అభివృద్ధి కుంటుపడింది. సరైనన్ని ఫ్లాట్ ఫారాలు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. బస్సులు ఎక్కడ పడితే అక్కడే ఆపుతున్నారు. వర్షాకాలంలో ఫ్లాట్ ఫారాల కొరత స్పష్టంగా కనిపిస్తున్నది. దాహం తీర్చుకోవడానికి త్రాగునీరు, ఆకలి తీర్చుకోవడానికి క్యాంటీన్ లేకపోవడం ప్రయాణికులకు శాపంగా తయారైంది. కనీసం బస్సు సిబ్బంది కూడా అవసరాలు తీర్చుకోలేకపోతున్నారు. ఆదాయంపై ఉన్న మ క్కువ సౌకర్యాలపై లేకపోవడమేమిటని మండి పడుతున్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు సమన్వయంతో మేలుకుని ఆమ నగల్లు బస్టాండ్‌ను అవసరాలకనుగుణంగా అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.

# మంత్రి మల్లారెడ్డి ఇళ్లపై ఐటి దాడులులను ఖండిస్తూ నిరసన

**-అలియాబాద్ చౌరస్తా వద్ద రాస్తారోకో..**
**-ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం**

**శామీర్‌పేట, నవంబరు 23, ప్రభాతవార్త**

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి ఇంటిపై, బంధువుల ఇళ్లపై ఐటి అధికారులు దాడులు చేసి సోదాలు నిర్వహించటాన్ని తీవ్రంగ ఖండిస్తూ శామీర్‌పేట, మూడుచింతలపల్లి రెండు మండలాల టిఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించి, ప్రధాన మంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద మండలాల టిఆర్ఎస్ అధ్యక్షులు వి.సుదర్శన్, జి.మల్లేశ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డికి మద్దతుగా ఐటి అధికారుల దాడులను, సోదాలు చేయటాన్ని ఖండిస్తూ రాస్తారోకో చేసి పిఎం మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ డౌన్‌డౌన్, బిజెపి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ టిఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగ శామీర్‌పేట మండల టిఆర్ఎస్ అధ్యక్షులు వి.సుదర్శన్, ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎండి జహంగీర్‌లు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెలంగాణ మంత్రుల, ఎమ్మెల్యేలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. మంత్రి మల్లారెడ్డి ఎంతో మందికి విద్యను అందిస్తూ కళాశాలలను విద్యాసంస్థలను ఏర్పాటు చేసి సేవలను అందిస్తున్నారని, వైద్యరంగంలోనూ సేవలు అందిస్తున్నారని, రాష్ట్రంలో మంచి గుర్తింపు పొందిన మంత్రి మల్లారెడ్డిపై కేంద్ర ప్రభుత్వం బిజెపి నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడటాన్ని తీవ్రంగ ఖండిస్తున్నట్లు పేరొన్నారు. కేంద్ర ప్రభుత్వం మంత్రి మల్లారెడ్డిని, బంధువులను బెదిరింపులకు గురిచేయటం, ఐటి దాడులు, ఇళ్లను కార్యాలయాలను, విద్యాసంస్థలలో సోదాలు నిర్వహించటాన్ని తీవ్రంగ ఖండిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మంత్రి మల్లారెడ్డి ఐటి దాడులు, సోదాలు నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు వైస్‌ఎంపిపి సుజాత, ఎంసిపల్లి మండల టిఆర్ఎస్ అధ్యక్షులు జి.మల్లేశ్‌గౌడ్, జడ్పీకోఆప్షన్ సభ్యుడు జహీర్, మండలాల టిఆర్ఎస్ కార్యదర్శిలు టి.అనిల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మండలాల సర్పంచుల సంఘంల అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచులు సింగం అంజనేయులు, జాంరవి, కృపాకర్‌రెడ్డి, ఎంపిటిసిలు పి.నాగరాజు, సొసైటీ వైస్‌చైర్మన్ ఐలయ్యయాదవ్, మండలాల నాయకులు వంగ పెంటారెడ్డి, వి.మురళీగౌడ్, డి.శ్రీకాంత్‌గౌడ్, ఎండి అఫ్జల్‌ఖాన్, మురళిగౌడ్, వంగ నర్సింహ్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, చాంద్‌పాష, పవన్‌ముదిరాజ్, రమేశ్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అలియాబాద్ చౌరస్తా వద్ద శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల టిఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేసి కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన తెలుపుతున్న దృశ్యం



మంత్రి మల్లారెడ్డిపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధించటానికి ఖండిస్తూ టిఆర్ఎస్ నాయకులు ప్రధానమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేసిన దృశ్యం

## అర్థాంతరంగా నిలిచిపోయిన బిసి కమ్యూనిటీ భవనం

**-మూడెళ్ళుగా బిల్లులు రాక కాంట్రాక్టర్ అవస్థలు**
**-దృష్టిసారించని ప్రజాప్రతినిధులు, అధికారులు**
**-ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు**



అసంపూర్తిగా బీసీ కమ్యునిటి భవనం

**పెద్దేముల్, నవంబరు 23, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలంలోని గాజీపూర్ గ్రామంలో గత మూడెళ్ళ క్రితం ప్రారంభమైన బీసీ కమ్యునిటి భవనం అర్థాంతరంగా నిలిచిపోయింది. మూడెళ్ళుగా బీసీ కమ్యునిటి భవనం అసంపూర్తిగా ఉన్న ప్రజాప్రతినిధులు, సంబందిత అధికారులు దృష్టి సారించడంలేదని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. 2019 సంవత్సరములో కమ్యునిటి భవన నిర్మాణానికి మొదటగా రూ.5 లక్షల ప్రతిపాదనలు పంపగా వాటికి సరిపడా పని పూర్తి చేయడంతో జడ్‌పి జనరల్ ఫండ్ నిధుల నుంచి రూ.5 లక్షలు చెల్లించారు. రెండవ విడతగా మరో రూ.5లక్షలు ప్రతిపాదనలు పంపగా, అట్టి నిధుల అనుగుణంగా నిర్మాణపు పనులు పూర్తి చేసిన ఇంతవరకు డబ్బులు చెల్లించడంలేదని కాంట్రాక్టర్ వాపొతున్నారు. ఇంతవరకు చేసిన పని బిల్లులే చెల్లించకుంటే పూర్తి పనులు ఏలా చేస్తామని కాంట్రాక్టర్ అంటున్నారు. తాను చేసిన పని రూ. 5 లక్షలు కాకుండా, కమ్యునిటి భవనం పూర్తి అయ్యేవరకు మరో రూ.15 లక్షలు అవసరం కావచ్చని అన్నారు. భవన నిర్మానము పూర్తి అయితే సమావేశాలు, తదితర విషయాలు మాట్లాడుకునేందుకు అవకాశం ఉండేదని, కాని గత మూడెళ్ళుగా బీసి కమ్యునిటి భవనం పూర్తి కాకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. హంగు అర్భాటంతో కమ్యునిటి భవన నిర్మాణపు పనులు మొదలు పెట్టి అర్థాతరంగా విడిచి పెట్టడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి భవన నిర్మాణము పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కమ్యునిటి భవన నిర్మాణము అర్థాంతరంగా నిలిచిపోయిందని పంచాయతీ రాజ్ ఏఈ సిద్దార్థను వివరణ అడుగగా, రూ.10 లక్షల మంజూరు కోసం ప్రతిపాధనలు పంపామని, మరో రూ.5 లక్షల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

## కానిస్టేబుల్ పై వ్యక్తి దాడి

**బషీరాబాద్,నవంబర్ 23,ప్రభాతవార్త:**

మంగళవారం రాత్రి విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పై ఓ వ్యక్తి చేయి చేసుకున్నాడు. బషీరాబాద్ ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్, తిరుపతి ఇద్దరు కానిస్టేబుల్ లకు పెట్రోలింగ్ చేయాలని ఆదేశించటంతో పెట్రోలింగ్ చేస్తున్న క్రామంలో మండల కేంద్రంలోని లక్ష్మీ విలాస్ బ్యాంక్ దగ్గర నిలబడి ఉన్న వ్యక్తిని ఇక్కడ ఎందుకు నిలబడి ఉన్నావ్ అని అడగి. తమ ఫింగర్ స్కానర్ డివైస్ కు తంబ్ ఇవ్వాలని కోరగా ఇవ్వనంటూ విధి నిర్వహణలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ లతో దురుసుగా మాట్లాడటంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరిగిపోయింది. ఇంతటితో ఆగకుండా బూతులు తిడుతూ కానిస్టేబుల్ పై చేయి చేసుకున్నాడు. పక్కనే ఉన్న మరో కానిస్టేబుల్ అ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నాడు. బాధిత కానిస్టేబుల్‌లు ఎస్‌ఐ కి ఫిర్యాదు చేయటంతో పోలీస్ సిబ్బందిపై చేయి చేసుకున్న చెన్నయ్య గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

# చిన్నారుల భద్రత ఎంతో అవసరం

**- సైబారాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**
**- పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై సమీక్ష సమావేశం**
**- సేఫ్టీ క్లబ్‌లను ప్రారంభించిన సీపీ స్టీఫెన్ రవీంద్ర**





**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్ 23, (ప్రభాతవార్త) :**

విద్యార్థుల దశ ఎంతో ముఖ్యమైనదని చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సైబారాబాద్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. బుధవారం పాఠశాలల్లోల భద్రత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సేఫ్టీ క్లబ్‌లను సైబారాబాద్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ... ఏదైనా సంఘటన గురించి నివేదించడానికి పిల్లలను అనుమతించాలని, వారికి పెద్దగా తెలియదని భావించవద్దని, వారు చెప్పేది వింటే వారి అభిప్రాయాన్ని తీసుకుంటే కొంత స్పష్టత వస్తుందని అన్నారు. పోలీసులు సహితం బడిపిల్లలతో చురుగ్గా ఉంటూ వారి మాటలను వినడం వల్ల పిల్లలకు, పోలీసులకు కొంత అవగాహన వస్తుందని అన్నారు. ఈ సేఫ్టీ క్లబ్‌లు అనేవి చైల్డ్ కేంద్రంగా ఉండాలని అన్నారు. పిల్లల జీవితంలో గణనీయమైన భాగానికి పాఠశాలలు జవాబుదారీగా ఉంటాయని, అందువల్ల పిల్లలందరు పాఠశాలల్లో సౌకర్యవంతంగా, ఆనందంగా, సురక్షితంగా ఉండేలా చేయడం చాలా పెద్ద బాధ్యత అని అన్నారు. పాఠశాలల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో డ్రగ్స్ దుర్వినియోగ నిరోధక కమిటీలను ప్రారంభించామని, పలు చోట్ల అవగాహన సదస్సులు సహితం నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా సీపీ తెలిపారు. అనంతరం శిల్పవల్లీ మాట్లాడుతూ... సేఫ్టీ క్లబ్ గురించి వివరిస్తూ సేఫ్టీ క్లబ్‌ల ప్రారంభంపై జరిగిన ఈ సమావేశానికి హాజరైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. సేఫ్టీ క్లబ్‌ల దృష్టి, లక్ష్యాల గురించి ఆమె వివరించారు. ఫిజికల్ సేఫ్టీ, సైబర్ సేఫ్టీ, యాంటీ డ్రగ్ అబ్యూజ్ అండ్ మెంటల్ హెల్త్ అనే నాలుగు విషయాల గురించి పూర్తిగా వివరించారు. ఈ నాలుగు కూడా నాలుగు స్తంభాలుగా ఉంటాయని ప్రతి స్తంభం కింద సేఫ్టీ క్లబ్ కన్వీనర్ బాలమిత్ర ఒక టీచర్ ఉంటారని, అదేవిధంగా ప్రతినెల వివిధ కార్యకలాపాలు ఉంటాయని ఆమె వివరించారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు భద్రతా ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంఘమిత్ర స్కూల్ ప్రిన్సిపల్ అనురాధ, కృష్ణ యేదుల, టీసీఎస్ జనరల్ మేనేజర్ రాజు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గోడ పత్రిక విడుదల




గోడ పత్రిక విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 23,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో బుధవారం ఏఐటీయుసి గోడ పత్రికను సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయుసీ రాష్ట్ర 3వ మహసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి సంబంధిత గోడ పత్రికను విడుదల చేసినట్లు ఆయన పెర్కోన్నారు. రాష్ట్ర మహసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, సురేందర్, ప్రభాకర్, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొందుర్గులో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీఎస్పీ పార్టీ నాయకులు

**కొందుర్గు, నవంబర్ 23, (ప్రభాతవార్త) :** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్యేయమని బీఎస్పీ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గం ఇంఛార్జీ తాట్టేపల్లి రాములు అన్నారు. కొందుర్గు మండల అధ్యక్షుడు దుర్గని శ్రీను ఆధ్వర్యంలో బుధవారం నాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలకు, రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బ స్టాండ్ వరకు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వేదికపై కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం 45 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డి శ్రీనివాస్, ప్రశాంత్, ఎ.నర్సింలు, తొండపల్లి దర్శన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 23,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని వనంపల్లి గ్రామంలో మృతి చెందిన అంబయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. బుధవారం ఆయన అంబయ్య కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అంబయ్య కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలు చేశారని అన్నారు. అంబయ్య కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగ ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో ఎంపిటీల సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి,అంజనేయులు, భాస్కర్, ఉన్నారు.

## పేద విద్యార్థులకు అండగా ఉప్పల ట్రస్ట్

**తలకొండపల్లి నవంబర్23,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలోని విజేత పాఠశాలలో చదువుతున్న నలుగురు నిరుపేద విద్యార్థులకు జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ఉప్పల ట్రస్ట్ ద్వా రా ఫీజులు కట్టి చదివిస్తున్నారు.దింతో బుధవారం విద్యార్థుల చదవుకు చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మల్లెకిడి అంబాజీ ,ఉప సర్పంచ్ అజీజ్,మాజీ ఉప సర్పంచ్ బోయ నర్సింహులు,యువ నాయకుడు వద్దే రాజు,తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి జయంతి పూజలో శ్రీనివాస్ యాదవ్

**తలకొండపల్లి నవంబర్23,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో సత్యసాయి 97వ.జయంతి సందర్భంగా స్వామి వారి పూజలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్ని పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో భక్తబృందం కన్వీనర్ కృష్ణ, సహ కన్వీనర్ విష్ణువర్ధన్,పవన్,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి మల్లారెడ్డిపై ఐటీ దాడులకు టిఆర్ఎస్ నిరసన



కీసరలో ఆందోళన వ్యక్తం చేస్తున్న టిఆర్ఎస్ నాయకులు

**కీసర, నవంబర్ 23, ప్రభాతవార్త:**
మంత్రి మల్లారెడ్డి ఇళ్లపై ఆదాయపు పన్నుశాఖ అధికారుల దాడులను నిరసిస్తూ బుధవారం కీసరలో టిఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. కీసర ప్రధాన చౌరస్తాలో టిఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యకర్తలు ధర్నా జరిపారు. మంత్రి మల్లారెడ్డిపై బిజెపి ప్రభుత్వం కక్ష్యగట్టి నోటీసులు ఇవ్వకుండా సిఆర్‌పిఎఫ్ బలగాలను మోహరించి దాడులు చేయడం దారుణమని అని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈకార్యక్రమంలో ఎంపిపి ఇందిర లక్ష్మినారాయణగౌడ్, వైస్ ఎంపిపి సలాల్‌పురం సత్తిరెడ్డి, సర్పంచ్ మాధురి వెంకటేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పెంటయ్య, కీరంగూడ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లి సర్పంచ్ మోర విమల నాగరాజు, యాద్గార్‌పల్లి సర్పంచ్ పుట్ట రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలు శిక్షణతో ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలి

**ఘట్‌కేసర్, నవంబర్ 23, ప్రభాతవార్త:**
స్వయం సహాయక సంఘాల మహిళలు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో సాయిసోషల్ ఎంపర్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్-మార్ట్‌ను ఆమె ప్రారంభించారు. మహిళల జీవనోపాధి కోసం మున్సిపల్ కార్యాలయ రోడ్డులో ఆర్-మార్ట్‌ను ఏర్పాటు చేయగా మున్సిపల్ చైర్‌పర్సన్, నాబార్డ్ సీజీఎం చింతల సుశీలతో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. నారాయణ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో కుట్టుశిక్షణ, బ్యూటీపార్లర్‌లో శిక్షణ పొందిన మహిళలకు వారి చేతుల మీదుగా ధృవపత్రాలు అందజేశారు. సాయిసోషల్ ఎంపర్‌మెంట్ సొసైటీ నిర్వాహకురాలు మంజుల ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి బ్యాంకుల ద్వారా ఋణాలతో ఉపాధి అవకాశాలను కల్పించడం పట్ల వారు ఆమెను అభినందించారు. ఈసందర్భంగా కుట్టుమిషన్, కిరాణాదుకాణం, బ్యూటీపార్లర్‌లో ఉత్తమ దుకాణ నిర్వాహకులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం శివశర్మ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో ఆర్-మార్ట్ ప్రారంభించి మహిళలకు ధృవపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, నాబార్డ్ సీజీఎం సుశీల

# ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే యాదయ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

**శంకర్‌పల్లి, నవంబర్ 23, ప్రభాతవార్త :**
ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శుభోదయం కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లి, హుస్సేన్‌పూర్ గ్రామాల్లో గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శంకర్‌పల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శంకర్‌పల్లి మండలం వివిధ గ్రామాలకు చెందిన 12మంది లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు రూ.5,82,500లను, కళ్యాణలక్ష్మి చెక్కులను 37మంది లబ్దిదారులకు రూ.37,04,292 చెక్కులను ఎమ్మెల్యే కాలె యాదయ్య అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పేదింటి మహిళలకు అండగా నిలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లికి భారం కాకూడదని సీఎం కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అన్ని వర్గాల ప్రజలల్లో ఆనందం చూడాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాలు ఏనాడు పేదింటి ఆడబిడ్డల వివాహానికి సమాయం చేయాలేదని, మహిళల సంక్షేమాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు తదితర పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ధర్మన్నగారి గోవర్దన్‌రెడ్డి జడ్పీటీసీ గోవిందమ్మగోపాల్‌రెడ్డి, సొసైటి చైర్మెన్ బద్ధం శశిదర్‌రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు గోపాల్, మున్సిపాలిటీ అధ్యక్షులు వాసుదేవ్‌కన్నా, వైస్ చైర్మెన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు ఆశోక్, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

# రైతన్నలకు,అణగారిన వర్గాలకు ఎల్లప్పుడు అండగా ఉంటా

### -కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**దౌల్తాబాద్,నవంబర్ 23,ప్రభాతవార్త:**
దౌల్తాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రైతన్నలకు,అణగారిన వర్గాలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని అన్నారు.మండలంలోని నిటూర్ గ్రామంలో (పీఏసీఎస్) వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం,ఎస్సీ కమ్యూనిటి హాల్(5లక్షలు) ప్రారంభించారు.మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో శివాలయ దేవాలయం నిర్మాణ భూమిపూజ(10లక్షలు) ప్రారంభించారు.లొట్టిగుట్టతాండలో నూతన సేవాలాల్ దేవాలయం(10 లక్షలు) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దేశంలో ఎక్కడలేని విధంగా రైతన్నలకు అన్ని విధాలుగా సహకారం అందుతుందని,ఇంటికి పెద్దకొడుకుగా ఆడపిల్లల పెళ్లిళ్లకు లక్షనూటపదహరు రూపాయలు అందిస్తున్నది కేవలం కేసీఆర్ నేతృత్వంలో మాత్రమే సాధ్యపడిందని అన్నారు.ఏ రాష్ట్రంలోలేని విధంగా వరి రైతులకు తగిన మద్దతు ధరను ఇస్తున్న నాయకుడు కేసీఆర్‌గారేనని అన్నారు.ఏ ఒక్క రైతుబిడ్డకు కూడా ఇబ్బంది కలగకుండా రైతుబంధు,రైతుభీమాలాంటి ఎన్నో పథకాలను అందిస్తున్నారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ పటేల్ విజయ్‌కుమార్,వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి,జడ్పీటీసీ కోట్ల మహిపాల్,ఎంపీడీఓ తిరుమలస్వామి, ఎంపీఓ రవీందర్,మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి,నాయకులు నరోత్తంరెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు శిరీషరమేష్, పాండునాయక్, వెంకటప్ప, హన్మప్ప, మరియు ఎంపీటీసీలు,ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా సంస్థానం వార్షికోత్సవం



షిరిడి సాయిబాబా సంస్థానంలో పూజలు (అన్నదాన కార్యక్రమం)

**ఘట్‌కేసర్, నవంబర్ 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని శ్రీషిరిడి సాయిబాబా సంస్థానంలో బుధవారం దేవస్థానం 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయం నిర్మించి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలో ఉదయం 5:15 గంటలకు కాకడ హారతి, పంచామృత అభిషేకం అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య నిర్వహించారు. అనంతరం బాబాకు ప్రత్యేక అర్చన, మధ్యాహ్నం 12 గంటలకు పంచారతి పూజాది కార్యక్రమాలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్పదీక్షాపరులు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బాబాను దర్శించుకొని వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావించి అన్నదానం చేశారు. దేవాలయ కమిటీ చైర్మెన్ కొంతం రాంరెడ్డి, మండల ఆర్‌బిఎస్ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, ఆలయ కోశాధికారి కొంతం నర్సింహ్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తళ్లం కోటేశ్వరరావు, గడిల ప్రభాకర్‌రెడ్డి, మాదిరెడ్డి బల్వంత్‌రెడ్డి, చందుపట్ల శ్రీనివాస్‌రెడ్డి, కంభం బాల్‌రెడ్డి, కీసరగుట్ట డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, సొసైటీ మాజీ డైరక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేముల గోవర్దన్‌గౌడ్, నాయకులు బద్దం కృష్ణారెడ్డి, పొత్కని మల్లికార్జునరాజు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్దెమర్రిలో మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య

**శామీర్‌పేట, నవంబరు 23, ప్రభాతవార్త :** ఉద్దెమర్రి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి సుజాత (40) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడుచింతలపల్లి మండల ఉద్దెమర్రి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. శామీర్‌పేట పోలీసుల, సంబంధితుల కథనం ప్రకారం ఉద్దెమర్రి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి సుజాత కొన్నాళ్ల నుంచి కడపునొప్పి బాధతో అనారోగ్యంగ ఉంటుందని బుధవారం ఉదయం కడుపు నొప్పి వచ్చి భరించలేక ఇంట్లో గదిలో తలుపులు పెట్టుకుని ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని పెద్దిరెడ్డి సుజాత ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఉద్దెమర్రి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి బలరాం రెడ్డితో సుజాతకు గత 23సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె(22), ఒక కుమారుడు(20) ఉన్నట్లు తెలిపారు. అయితే ఉద్దెమర్రిలో గల స్వంత ఇంటిలో గదిలో సుజాత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అయితే కూతురు వర్క్ ఫర్‌హోమ్ విధులు నిర్వహిస్తున్నట్లు తల్లి గదిలోకి వెళ్లి తిరిగి బయటకు రాలేదని, తలుపులు కొట్టిన తీయకపోవటంతో వెంటనే మేనమామకు ఫోన్‌చేయటంతో ఆయన వచ్చి తలుపు పగులగొట్టి చూడగ ఫ్యాన్‌కు సుజాత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నట్లు తెలిపారు. ఆమె కడుపు నొప్పి వచ్చి భరించలేక ఆత్మహత్య చేసుకుందని దీనిలో ఎవరిపైన అనుమానం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం హాస్పిటల్ మార్చురికి తరలించారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మంత్రి మల్లారెడ్డిపై ఐటీ దాడులకు నిరసనగా ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం



.మంత్రి మల్లారెడ్డిపై ఐటీ దాడులకు నిరసనగా టీఆర్ఎస్ పోచారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న టీఆర్ఎస్ నాయకులు.

**ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 23, ప్రభాతవార్త:**
రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిపై కుట్ర పూరితంగా జరుగుతున్న ఐటీ దాడులకు నిరసనగా పోచారం మున్సిపల్ టీఆర్ఎస్ నాయకులు బుధవారం వరంగల్ జాతీయ రహదారిపై నారాపల్లి వద్ద ప్రధాని దిష్టి బొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మందాడి సురేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుం దని ఆరోపించారు. అందులో భాగంగానే మంత్రి మల్లారెడ్డి ఇంటిపై ఐటీ దాడులు చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. ఐటీ దాడులకు నిరసనగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, మున్సిపల్ టీఆర్ఎస్ అధ్య క్షుడు మందాడి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు బాలేశ్ కురుమ, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, ఎస్. రవీందర్ గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ. అక్రం అలీ, నాయకులు బద్దం జగన్‌మోహన్ రెడ్డి, అబ్బవతి నర్సింహ, మోటుపల్లి శ్రీనివాస్, నర్రీ కాశయ్య, ఆకిటి బాల్‌రెడ్డి, సుర్వే శ్రీనివాస్, కొమ్మా రెడ్డి శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్సలో సరికొత్త విజయాల గురించి అవగాహన

శామీర్‌పేట నవంబర్23,ప్రభాతవార్త : దేశంలో శారీరక వైకల్యానికి నాలుగో అతి పెద్ద కారణంగా ఆర్థరైటిస్ ఉంటుందని అంచనా .వ్యాధి ముదురుతున్న కొద్ది నొప్పి కారణంగా రోగుల్లో వైకల్యాలు ఏర్పడటంతో పాటు శారీరక కదిలికలు కూడా పరిమితమైపోయి వారి ఉత్పాదక సంవత్సరాలు తగ్గుతాయి.పెరుగుతున్న అర్థరైటిస్ కేసుల విషయంలో అవగాహన పెంచేందుకు చికిత్సలో సాధించిన సరికొత్త విజయాల గురించి వివరించేందుకు జాన్సన్,జాన్సన్ మెడ్‌టెక్ ఇండియా,గంగా మెడికల్ సెంటర్,హాస్పిటల్స్ ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది.అర్థరైటిస్ బాగా ముదిరిన సందర్భాల్లో మోకాలి మార్పిడి ఆపరేషన్ అన్నది అత్యంత ఆచరణీయమైన పరిష్కారాల్లో ఒకటిగా ఆవిర్భావించింది.దేశంలో 2లక్షలకు పైగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయి.మేనేజింగ్ డైరెక్టర్ మక్కర్ మాట్లాడుదుతూ... అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితమైన,ప్రభావంతమైన రీతిలో శిక్షణ అందించేందుకు జాన్సన్,జాన్సన్ మెడ్‌టెక్ ఇండియా కట్టుబడి ఉందన్నారు.

## ఏయూలో వ్యవస్థాపకత, వ్యాపార సెటప్‌పై అవగాహన

**ఘట్‌కేసర్, నవంబర్ 23, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో బుధవారం వ్యవస్థాపకత, వ్యాపార సెటప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెంకటాపూర్ గ్రామస్తులకు వ్యవస్థాపక అవకాశాలను పెంపొందించడానికి రెండు రోజుల పాటు ఈఅవగాహన సదస్సును ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.రామచంద్రం ప్రారంభించి ప్రసంగించారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సయ్యదా సమీన్‌ఫాతిమా, విజెఐటి డైరక్టర్ ప్రొఫెసర్ జి.సాయిబాబారెడ్డి, ఇన్వెస్టిగేషన్ హెడ్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.విష్ణువందన, కో-ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నకేశ్ మల్లేశ, స్థానిక సర్పంచ్ నిరుడి గీతా శ్రీనివాస్, ప్రోగ్రామ్ సమన్వయకర్త శివప్రియ, ఆత్మారావులు హజరై మాట్లాడారు. వ్యవస్థాపకత ప్రాముఖ్యతను గ్రామస్తులకు స్వయం సమృద్ధిగా ఉండాల్సిన అవసరాలను వివరించారు. మహిళా పారిశ్రామికవేత్త లోల్ల పావని, ఎంఎస్ఎంఈ ప్రతినిధి నవీన్, ఏయూ అడ్మిషన్స్ డైరక్టర్ డాక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావులు సదస్సులో మాట్లాడి వ్యాపారాల ఏర్పాటు నిర్వహణపై పలు అంశాలను తెలియజేశారు. వెంకటాపూర్‌కు చెందిన వంద మంది గ్రామస్తులు పాల్గొని వ్యవస్థాపక నైపుణ్యాలు, వ్యాపార ప్రణాళిక తయారీపై అవగాహన పొంది వారి ఆలోచనలను ప్రదర్శించారు.




ఏయూలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ రామచంద్రం

### అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

**నర్సాపూర్, నవంబర్ 23, ప్రభాతవార్త :**
నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లో అతిథి అధ్యాపక నియామకం కొరకు దరకాస్తు అహ్వానిస్తున్నామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ ఒక ప్రకటలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజీ లో 55 శాతం ఉత్తీర్ణత కలిగిన వారు అర్హులని తెలిపారు. ఎస్సీ అభ్యర్థులకు పిజీ లో 50 శాతం మార్కులు ఉండాలన్నారు.పిహెచ్‌డి నెట్ సెట్ ఉన్నవారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.అభ్యర్థులు తగిన జిరాక్స్ మరియు ఒరిజనల్ సర్టిఫికెట్ పత్రాలతో కళాశాలలో ఈనెల 26 వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు. ఈమేరకు అభ్యర్థులకు డెమో మరియు ఇంటర్యూలు నిర్వహించడం జరుగతుదందని ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ తెలిపారు.

### సిసి రోడ్ల నిధులు మంజూరు పట్ల హర్షం

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 23, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని గ్రామపంచాయతీలకు సీసీ రోడ్లకు నిధులు మంజూరి చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, జిల్లా సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు, ఆర్. వెంకటాపూర్ సర్పంచ్ బండారి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కోనాపూర్, దంతేపల్లి గ్రామాలకు రూ.60 లక్షలు సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి

**మెదక్, నవంబర్ 23, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం దర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి చదువుతున్న లక్ష్మీప్రసాద్ జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మహేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న చిత్రలేఖనం పోటీలలో లక్ష్మీ ప్రసాద్ చాచా నెహ్రూ చిత్రపటాన్ని గీసి తన ప్రతిభను కనబర్చి, జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు అభినందించారు.

### పర్యావరణ వ్యవస్థను రూపొందించడమే ఐఆర్ఎల్ లక్ష్యం

నాగారం నవంబర్23,ప్రభాతవార్త : మోటార్‌స్పోర్ట్స్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి సాంకేతిక భాగస్వామిగా ఇండియన్ రేసింగ్ లిగ్ కోసం రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎక్సక్సన్‌మోబిల్ లూబ్రికెంట్స్ ప్రైవెట్ లిమిటెడ్ భాగస్వామ్యం చేసుకుంది.వోల్ఫ్ రేసింగ్ ద్వారా ఆధారితమైన ఇండియన్ రేసింగ్ లీగ్ యొక్క మొదటి ఎడిషన్ హైదరాబాద్‌లో నవంబర్19న ప్రారంభమై ఇది ఆరు నగర ఆధారిత ఫ్రాంఛైజీ జట్లను కలిగి ఉన్న ఏకైక 4-వీల్ రేసింగ్ లీగ్,ఎక్స్ పార్ములా వన్,లి మాన్స్ డ్రైవర్‌లతో సహా మహిళలు ,పురుషులు ఇద్దరూ ఒకే ప్లాట్‌ఫామ్‌లో రేసింగ్‌లో పాల్గొంటారు.రౌండ్ 2 ,రౌండ్ 3 మద్రాస్ మోటార్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ (ఎంఎంఆర్‌టి)లో నవంబర్ చివరిలో ,డిసెంబర్ వారాంతాల్లో జరుగుతాయి. గ్రాండ్ ఫినాలే డిసెంబర్ 10-11 తేదిలలో హైదరాబాద్‌లో జరుగుతుంది.కొత్త శకానికి నాంది పలికేందుకు మోటార్‌స్పోర్ట్స్ కొరకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి, గ్లోబల్ రేసింగ్ ప్లాట్‌ఫామ్‌లలో క్రీడ కోసం విజిబిలిటీని సృష్టించడం ఐఆర్ఎల్ లక్ష్యం ఎక్సక్సన మొబిల్‌తో భాగస్వామ్యం దేశంలో ఈ రంగానికి మరింత విలువను జోడిస్తుంది.

**PUBLIC NOTICE**

The General Public hereby informed that pertains to **Sri. Venkata Subba Rao Abbaraju S/o. Sri. A.L.Kantha Rao** aged about 55 years, Occ: Business, R/o. H.No. 3-175, Street No.2, Chaitanya Hills, Meerpet, K.V.Ranga Reddy District, Telangana State., has approached the Alwal Branch, Shriram City Union Finance Ltd., Hyderabad to obtain Loan by put their documents by way of Mortgage in respect of Schedule of Property to secure the future Liability towards loan amount. If any person or person/s having any objection, right, claim, title, interest over the Schedule of property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **Sri.Venkata Subba Rao Abbaraju** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY-I**

All that part and parcel of Open Plot No.28, admeasuring 333Sq.yds., or equivalent to 278.42Sq.mts., (VLTN/ Assessment No. 320549000061) in the Layout knowm as "O2 Zone Annex" in Survey Nos.475, 476/A, 476/AA & 476/E, Situated at Chegur Village and Grampanchayath, Nandigama Mandal, Ranga Reddy District, Regn. Sub-Dist: Shadnagar, Regn. Dist: Ranga Reddy, Telangana State and bounded by: NORTH : Plot No.27, SOUTH : Open Plot, EAST : Plot No.11, WEST : 30' Wide Road.

**SCHEDULE OF THE PROPERTY-II**

All that part and parcel of Open Plot No.11, admeasuring 333Sq.yds., or equivalent to 278.42Sq.mts., (VLTN/ Assessment No. 320549000060) in the Layout known as "O2 Zone Annex" in Survey Nos.475, 476/A, 476/AA & 476/E, Situated at Chegur Village and Grampanchayath, Nandigama Mandal, Ranga Reddy District, Regn. Sub-Dist: Shadnagar, Regn. Dist: Ranga Reddy, Telangana State and bounded by: NORTH : Plot No.12, SOUTH : Open Plot, EAST : 30' Wide Road, WEST : Plot No.28.

**Sd/- (P.Srinivasa Rao)**
Advocate
Flat No.A-14, G.F., Srinivasa Heights Apts, Adarshnagar, Uppal, Hyderabad-39. **Cell:9346666438.**

**PUBLIC NOTICE**

The General public is hereby informed that our client Shriram City Union Finance Limited Santosh Nagar Branch, Hyderabad, Dist is dealing with financing business in the course of business **Smt. Rachakonda Sunitha W/o. Rachakonda Raju Sagar,** approached our client for finance and accepted to deposit her title deeds in respect of his property i.e., **All that the piece and parcel of the Plot No. 12/Part, Survey No. 2/A, 2/Aa admeasuring 150 Sq.yards, equaling 125.4Sq.Mtrs, Situated at Moinabad H/O Surangal Village Moinabad Grampanchayath, Moinabad Mandal, Ranga Reddy District, T.S and Bounded as follows:-** NORTH : Neighbour Land. SOUTH : Plot No.12/Part. EAST : 18 Feet Wide Road. WEST : Plot No.1. Towards security. for the loan availed by him, If any person or persons having any claim, right, title or interest in the said property may approach the undersigned within 7 days from the date of this publication or else our client will proceed with transation.

**Sd/- S.SRINIVAS RAO, A.SUPRIYA**
Advocates
H.No.2-19-79/A/10/A, Balaji Enclave Extn, East Kalyanpur, Uppal, Hyderabad-500 039
**Cell: 9948104019**

**PUBLIC NOTICE**

The general public hereby informed that **BOLLAMPALLI HARISH KUMAR S/O. BOLLAMPALLI KRISHNAIAH,** aged about 24 years, Occ: Agriculture, R/o. H.No.13-47, Kodandaram Nagar, Gaddiannaram, Saroornagar, Ranga Reddy District has approached the Shriram City Union Finance Ltd., Kukapally Branch, Hyderabad., by put his documents by way of mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections. Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned **BOLLAMPALLI HARISH KUMAR S/O. BOLLAMPALLI KRISHNAIAH,** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

All that the Piece and Parcel of House bearing No.11-36, (PTIN No.3281769000036), admeasuring 363 Sq.Yds., having Plinth area 825, with RCC, roof, in Sy.No.238/ E/2, Situated at Gattu Ippalapally Village, Under Veerannapally Gram Panchayat, Talakondapally Mandal, Ranga Reddy District, and bounded by: **NORTH :** House belongs to Kondal. **SOUTH :** Road. **EAST :** Open Place. **WEST :** Road.

**Sd/-R.VENKATESHWAR RAO**
Advocate
#5-3-29, RamalayamTemple, Kukatpally, Hyderabad-500072.
**Cell: 9391093566,8519985749.**
Email Id: venkateshwarraoadv@gmail.com

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that our client M/s. Shriram City Union Finance Limited, Secunderabad-II Branch, Hyderabad is dealing with financing business. In the course of business, **Smt. Narukudi Santhoshi Kumari, W/o. Shyam Kumar,** aged about 31 years, Occupation: Business, R/o. H.No. 3-26/1, New (3-15 Old), Uppariguda Village, Ibrahimpatnam Mandal, Ranga Reddy District, has approached our client for trade finance and accepted to deposit her title deeds in the respect of the property **SCHEDULE OF PROPERTY:-** All that the piece and parcel of House bearing No.3-26/1, admeasuring an 115 square yards or equivalent to 96.15 square meters, having plinth area 307 square feet with ACC Sheets, Situated at Uppariguda H/o. Khalsa Ibrahimpatnam Village, Ibrahimpatnam Revenue Mandal, Ranga Reddy District, under Uppariguda Grampanchayat, SRO: Ibrahimpatnam and bounded by:- North : House of N. Shiva Kumar, South : House of N. Sahadev, East : Open Land, West : 10" Wide Road, as security for the loan availed by her. If any person or persons having any claim or interest in the above property may approach the undersigned within seven days from the date of this publication or else our client will proceed with the transaction.

**M. VANAMA RAJU**
**ADVOCATE, HYDERABAD**
**Mobile No.9963874156**

**PUBLIC NOTICE**

The General public hereby informed that pertains to **Sri. KANAPARTHY NARESH KUMAR S/o. Sri. KANAPARTHY KRISHNA MURTY** aged about 45 years, Occ: Business, R/o. H. No. 8-1-136/a.67, Maruthi Nagar Colony, Shaikpet, Near Sai Baba Temple. Golconda, Hyderabad, Telangana State., to obtain Loan by put their documents by way of Mortgage in respect of Schedule of Property to secure the future Liability towards loan amount. If any person or person/s having any objection, right, claim, title, interest over the Schedule of property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **Sri. KANAPARTHY NARESH KUMAR** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

All that part and parcel of Open Plot Bearing No. 820, admeasuring 200 Sq. yds.. or equivalent to 167.22 Sq. mts., in Survey Nos. 9, 11, 12, 13, 15, 16, 17, 18, 47, 49, 50, 51, 52 55, 56, 57, 58, 66 & 67 Situated at Jogammaguda Village, Raikal Grampanchayath. Farooqnagar Mandal, Ranga Reddy District, under jurisdiction of Farooqnagar Sub-Registrar, Regn. Dist: Ranga Reddy, Telangana State and bounded by: NORTH: 33' Wide Road, SOUTH: Plot No. 819, EAST 33' Wide Road, WEST : Plot No. 813.

**Sd/- P. SRINIVASA RAO**
**Advocate**
Flat No.A-14, Ground Floor, Srinivasa Heights Apts, Adarshnagar, Uppal, Hyderabad-39. Cell: **9346666438**

**PUBLIC NOTICE**

The General public are hereby informed that **Sri. KUMMARI VITTALAIAH S/o Sri. RANGAIAH** aged about 38 years, Occ: Agriculture, R/o. Nandigama Village and Mandal, Ranga Reddy District, Telangana State., has approached the Maredpally Branch, Shriram City Union Finance Ltd., Hyderabad to obtain Loan by put their documents by way of Mortgage in respect of Schedule of Property to secure the future Liability towards loan amount. If any person or person/s having any objection, right, claim, title, interest over the Schedule of property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **Sri. KUMMARI VITTALAIAH** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

All that the part and parcel of the Plot, in Survey No.1357/A, admeasuring 1089 Sq.yds.. or equivalent to Ac.0-09 gts., Situated at Nandigama Village and Grampanchayath, Nandigama Mandal, Nandigama outskirts, Ranga Reddy District, Regn. Sub Dist: Shadnagar, Regn. Dist: Ranga Reddy District, Telangana State and bounded by: North: Nandigama to Veerlapally Road, South: Land of Survey No.1357 of V Kousalya, East: Land of Survey No.1356, West: Land of Survey No.1357 of V. Kamalamma.

**Sd/- P. SRINIVASA RAO**
**Advocate**
Flat No.A-14, Ground Floor, Srinivasa Heights Apts, Adarshnagar, Uppal, Hyderabad-39. Cell: **9346666438**

**PUBLIC NOTICE**

The general public are hereby informed that my client **Smt. I. SUJATHA W/o I. B. RAM SHARMA,** R/o H.No.11-3-384, Plot No. 22, Srinivas Nagar Colony, Secunderbad-500061, She Has lost the Original Sale Deed Link Documents bearing No.1418/2002, 1430/2002 & 10032/2002 Regd. S.R.O Ghatkesar. On 06/11/2022 at about 11.30 A.M While Travelling from Ghatkesar to uppal and to that effect she has also lodged a complaint with police Ghatkesar, therefore I request the founder of the said document to return the same to my client, and she would be suitably rewarded.

**PRASHOBH KUMAR K**
**Advocate**
#4-6, EWS Colony, Ghatkesar, Medchal.Dist
**Cell: 9246969393**

## ఆంజనేయ స్వామి క్షేత్రాన్ని దర్శించుకున్న స్వాములు



లోంక ఆంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న సర్పంచ్ రాజు నాయక్, తదితరులు

**నందిగామ నవంబర్23,ప్రభాతవార్త :**
నందిగామ మండలంలోని తాటిగడ్డ తండాకు చెందిన అయ్యప్ప స్వాములు బుధవారం కాలాపూరం లోంక ఆంజనేయస్వామి క్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. చాకలిధని గుట్ట గ్రామపంచాయతీ సర్పంచ్ గురుస్వామి జెట్టావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో గురుస్వామి లక్ష్మణ్ నాయక్, వార్డు సభ్యుడు జెట్టావత్ శ్రీను నాయక్ స్వామి, కన్నెస్వాములు హనుమంతు, లష్కర్‌లు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. మండలంలో ఆయా గ్రామాలలో యువకులు అయ్యప్ప మాలధారణ చేయడంతో దేవాలయాలు స్వాముల, భక్తజనుల పూజలతో ఆధ్యాత్మికశోభతో కళకళలాడాయి.

## సాగులో మెలకువలు పాటిస్తే అధిక లాభాలు

**-వ్యవసాయ ఉప సంచాలకులు సుజాత**



కోనాపూర్ గ్రామంలో పర్యటించిన వ్యవసాయాధికారులు

**ఆమనగల్లు, నవంబర్23, ప్రభాతవార్త:**
వ్యవసాయ శాస్త్రవేతలు, అధికారుల సూచనలు పాటించి సాగులో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయశాఖ జిల్లా ఉపసంచాలకురాలు సుజాత రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు రాబట్టవచ్చని ఆమె సూచించారు. గురువారం మండల వ్యవసాయాధికారిణి అరుణకుమారితో కలిసి ఉప సంచాలకురాలు సుజాత ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పలు వరి పంటలను పరిశీలించారు. జీవన ఎరువు వినియోగించి భాస్వరమును కరిగించి సాగు చేసిన వరి చేనును సర్పంచ్ మల్లమ్మయాదయ్య, ఎంపిటిసి సరితపంతునాయక్‌తో కలిసి వారు పరిశీలించారు. ఆనందం వ్యక్తం చేశారు. అదే చేనులో క్షేత్ర దినోత్సవాన్ని జరుపుకున్నారు. భాస్వరము కరిగించేందుకు జీవన ఎరువు వినియోగించడం వల్ల పంట పెట్టుబడిని భారీగా తగ్గించుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా భూసారం మెరుగుపడి పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ నిఖిత, గుండమోని నరసింహ్మా, ఈదమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 23,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రానికి చెందిన అలుగొండ రమేష్‌కు లక్షా యాభైవేల రూపాయల ఎల్ఓసీని బుధవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అందజేశారు. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసుకున్న రమేష్‌కు ఆర్థిక స్తోమత సరిపోకపోవడం వల్లన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధికి ధరకాస్తు చేసుకున్నాడు. బాదితుని విన్నపం మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార లక్షా యాభైవేలు మంజురు అయ్యాయి. ఈ ఎల్ఓసీని ఎమ్మెల్యే చేతుల మీదుగా బాదితుని ఆందజేశాడు. ఈ కార్యక్రమంలో మాజి వైస్ ఎంపీపీ చంద్రబాబగౌడ్ తదితరులు ఉన్నారు.

## విధి నిర్వహణ చేయమంటే కక్షసాధింపు అంటున్నారు

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 23,(ప్రభాతవార్త):**
విధి నిర్వహాన సరిగ్గా చేయాలని సూచిస్తే తమపై కక్షసాదింపు చర్యలు చేపడుతున్నారని ఫిర్యాదులు చేపయడం సరికాదని ఏపీఎం రామస్వామి ఒక ప్రకటనలో పెర్కోన్నారు. తమ వద్ద పని చేస్తున్న సీసీలు తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో సరిగ్గా విధులు నిర్వహించాలని, లెక్కలు సరిగ్గా చూపాలని ఆదేశిస్తే తమను వేధిస్తున్నాడని పై అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. తమకు సీసీలపై ఎలాంటి వ్యక్తిగత కక్షలు లేవని ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పనులు చేస్తున్నట్లు ఆయన పెర్కోన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



**తలకొండపల్లి నవంబర్23,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలంలోని మాదాయపల్లి పాఠశాలలో జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ సౌజన్యంతో ప్రధానోపాధ్యాయులు భగవంత్ రాజ్ అధ్యక్షతన జరిగిన క్రీడా దుస్తుల కార్యక్రమానికి ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించడంలో ముందుంటామని తెలియజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి రామస్వామి, ఎంపిటిసి అంబాజీ, ఎస్ఎంసి ఛైర్మన్ శంకర్, ఉప సర్పంచ్ జయమ్మ, శ్రీనివాసులు, వెల్జాల్ ఉప సర్పంచ్ అజీజ్, సిఆర్‌పి మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయులు జావీద్ అలీ, రమేష్, నాయకులు శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి ధర్నా

**తలకొండపల్లి నవంబర్23,ప్రభాతవార్త :**
ఏఐసిసి కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి ఆదేశాల మేరకు 24న అన్ని మండల కేంద్రాలలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించనున్నామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సమస్య తీర్చడలేదని ధాన్యం కొనుగోలు ,దరణి సమస్యలపై రైతుల రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, రైతు సంబంధిత అంశాలపై నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలని మండల కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నాలని కోరారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఉదయం 10 :45కు జరిగే నిరసన ధర్నా కార్యక్రమాలో పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం

**- కాంగ్రెస్‌ను హెచ్చరించిన టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ నాయకులు

**కొందుర్గు, నవంబర్ 23, (ప్రభాతవార్త) :**
షాద్‌నగర్ నియోజక వర్గాన్ని అన్ని రంగాలల్లో అభివృద్ధి చేస్తూ, ఆహర్నిశలు పనిచేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని టీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక జీఎం పటేల్ పంక్షన్ హాల్‌లో వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, విండో ఛైర్మన్ దామోదర్‌రెడ్డిలతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 8 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా అంజయ్యయాదవ్ రోడ్డు లేని గ్రామానికి బీటీ రోడ్లు వేయించారని, అంగన్ వాడీ భవనాలు, పాఠశాల అదనపు గదులు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి వాటిని పూర్తి చేయించారని అన్నారు. ప్రజాప్రతినిధులుగా గెలువని వారు స్థాయిని మర్చి ఎమ్మెల్యేను విమర్శించటము వారి అవివేకమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏమి పథకాలు చేస్తారో చెప్పి ధైర్యం లేదుకాని, టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలను విమర్శించటము ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాలల్లో తమ ఉనికి కాపాడుకునేందుకే రెచ్చగొట్టి మాటలు మాట్లాడుతూ ఎమ్మెల్యేతో పాటు వారి కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడ కార్యక్రమాలు ఏర్పాటు చేసిన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి తిప్పికొట్టే కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీజ తన స్థాయిని మర్చి ముఖ్యమంత్రి కేసీఆర్ పై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ ప్రజలను రెచ్చగొటుతున్నారని, సరైన సమయంలో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ దమ్ముంటే అభివృద్ధి పనుల సమీక్షపై బహిరంగ సవాల్‌కు సిద్ధం కావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మండల రైతు సమక్షంలో సమితి కోఆర్డినేటర్ రెడ్డి నర్సింలు, పార్టీ నాయకులు రామకృష్ణ, దర్గా రాంచంద్రయ్య, బలవంత్‌రెడ్డి, రవిగౌడ్, శ్రీశైలం, రామకృష్ణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రాజారామేశ్వర్‌రెడ్డి, సర్పంచులు నర్సింహ్మారెడ్డి, గుర్ల రాంచంద్రయ్యలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో భగవాన్ సత్యసాయి జన్మదిన వేడుకలు



. ఆమనగల్లులో సత్యసాయి జన్మదినం వేడుకలలో పాల్గొన్న చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య చిత్రంలో సేవా సమితి ప్రతినిధులు



ఆమనగల్లులో మందిరంలో వ్రతాలు చేస్తున్న భక్తులు

**ఆమనగల్లు, నవంబర్23, ప్రభాతవార్త:**
భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబ జన్మదిన వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య సామూహిక వ్రతాలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గురువారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు దొంతు శ్రీనివాస్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జన్మదినం పురష్కరించుకుని సాయి మందిరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. వివిధ పుష్పాలతో మందిరాన్ని అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాన్ని ప్రారంభించిన భక్తులు పట్టణంలోనీ పుర వీధుల గుండా నగర సంకీర్తన చేశారు. సత్యసాయి నామ స్మరణ, ప్రత్యేక భజన గీతాలతో వీధులు ఆధ్యాత్మికశోభను సంతరించుకున్నాయి. అనంతరం పూజారి ఆమనగంటి నాగభూషణశర్మ ఆధ్వర్యంలో మందిరంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. సామూహిక వ్రతాలు చేసి స్వామిని పూజించారు. పూజలకు మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, ప్రముఖ వైద్యుడు, సీనియర్ సాయి భక్తుడు దొంతు పుల్లయ్య, సుందూరి చంద్రశేఖర్‌లు హాజరైనారు. నిర్వాహకులు మందిర ఆలయ మర్యాదలతో ఆహ్వానించి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కాగా సాయంత్రం మందిర ఆవరణలో భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబ ఊయల సేవ, జన్మదిన కేక్ కటింగ్, మహా మంగళహారతితో వేడుకలను ముగించారు. కార్యక్రమంలో ఆమనగంటి సంజీవ్‌కుమార్, దొంతు విశ్వనాథం, గాజుల శ్రీను, పొలిశెట్టి శ్రీను, నాగిళ్ళ లింగం(చంటి), బ్రహ్మం, రాముగోల్డు, పల్లె అల్లాజిగౌడ్, శంకర్, గుర్రం సురేష్, ఎన్ఆర్ ప్రభాకర్, గందె శేఖర్, దాస శ్రీనివాస్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపితోనే ఎస్సీలకు సముచిత స్థానం: తాండ్ర రవీందర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

**యాచారం, నవంబర్ 23 ప్రభాతవార్త**
ఎస్సీల ఆత్మగౌరవం, సముచిత స్థానం బిజెపితోనే సాధ్యమని బిజెపి మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గడ్డం దయాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన మంత్రివర్గంలో 12 మందికి మంత్రులుగా అవకాశం కల్పించిందన్నారు. టిఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ఎస్సీలకు గౌరం లేకుండా పోయిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ దళితులకు చేసిన మోసాలను క్షుణ్ణంగా వివరించారు. దళిత ముఖ్యమంత్రి హామీ నెరవేరకపోగా మంత్రివర్గంలో కూడా సముచిత స్థానం లేదన్నారు. దళిత కుటుంబాలకు మూడెకరాల ప్రభుత్వ భూమి ఇవ్వకపోగా అభివృద్ధి పేరిట దళితుల నుండి వేల ఎకరాలు గుంజుకుంటూ అడిగితే అక్రమ కేసులు బనాయిస్తున్నాడన్నారు. గత ఎనిమిదేళ్లుగా ఎస్సీ కార్పోరేషన్ లోన్లు ఇవ్వకుండా ఎస్సీలను వ్యాపార రంగానికి దూరం చేశాడని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి ఎస్సీలకు ఖర్చు చేయడం లేదన్నారు. దళిత బంధు పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా పథకాన్ని ఎత్తివేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్సీలకు రిజర్వ్ అయితే ఇప్పటి వరకు కూడా నింపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వం ఎస్సీలను అన్ని విధాలుగా ఆదుకుంటూ అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మాస్కురి శశిధర్, బిజెవైఎం ప్రధాన కార్యదర్శి కొండాపురం నాగరాజు, బిజెపి నాయకులు గుర్రం మధుకర్‌రెడ్డి, సురేష్‌తో పాటు గ్రామ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ సంబరాలు...



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో వక్తలు, ఉపాధ్యాయులు

**షాద్‌నగర్, నవంబర్ 23, (ప్రభాతవార్త) :** చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని సుమారు 43 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి తెలుగు, ఇంగ్లీష్ మీడియం విభాగాల్లో విడివిడిగా జరిగిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. తెలుగు మీడియం విభాగంలో ఫరూక్‌నగర్‌కు చెందిన గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థులు, ఇంగ్లీష్‌మీడియం విభాగంలో గురుకుల కమ్మదనం విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల విభాగంలో షాద్‌నగర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, బ్రిలియంట్ హైస్కూల్ టీచర్స్ కాలనీకి చెందిన బ్రాంచ్ విద్యార్థులు విజేతలుగా ఎంపికైన్నాట్లు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ బండారి, జన విజ్ఞాన వేదిక రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.సుధాకర్‌రెడ్డి, ఠాగూర్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ రవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహా ధర్నా

**-నియోజకవర్గం రైతులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గోనాలి**
**-టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శాబాద్ దర్శన్ పిలుపు**

**మొయినాబాద్, నవంబర్ 23, ప్రభాతవార్త :** రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడి పిలుపు మేరకు నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు, రైతుల సమస్యలు, ధరణి పోర్టల్ రద్దు, వడ్ల కోనుగోలు, వడ్లకు మద్దతు ధర కోరకు, గురువారం నియోజకవర్గంలోని అన్ని మండలాల తహశీల్దార్ కార్యాలయాల ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్న నిర్వహించనున్నట్లు టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శాబాద్ దర్శన్ పిలుపునిచ్చారు, ఈ సందర్భంగా శాబాద్ దర్శన్ మాట్లాడుతూ తెలంగాణలో రైతుల సమస్యలు తెలంగాణ రాకముందు కంటే ఇప్పుడే అధికంగా ఉన్నాయని అన్నారు, రైతుల ఆత్మహత్యలు అగలేదని, ఉచ్చిత ఎరువుల పంపిణి పేరుకు మాత్రమే అన్నారు, ముఖ్యమంత్రి కేసిఆర్ రైతుల నోట్ల మిట్టి కోట్టి ఆయన మాత్రం పంచభక్ష పరమ్మనాలు తింటునాడని అన్నారు, తెలంగాణ రైతులను దరణి పోర్టల్ పేరుతో కంటీమీద కునుకులేకుండా చేశాడని అన్నారు, పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేసిన పాపానికి రైతులను సంకేళ్లతో బందించి, జైలుపాలు చేసిన చరిత్ర బంగారు తెలంగాణ పేరుతో పబ్బం గడుపుతున్న టీఆర్ఎస్ పార్టీకి కేసిఆర్‌కు మాత్రమే దక్కుతుందని అన్నారు, ముఖ్యమంత్రి కేసిఆర్ రైతులపై చేస్తున్న రాచరికపాలన అంతమోందించడానికి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు టీపీసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు చేవెళ్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రైతుల కోసం పోరాడి రైతుల హక్కులను ఆత్మగౌరవాన్ని కాపాడుతారని తెలిపారు, రైతుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మొయినాబాద్ మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం 11 గంటలకు నిర్వహిస్తున్న ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు,

## కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన శంకర్‌పల్లి విద్యార్థి



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**శంకర్‌పల్లి, నవంబర్ 23, ప్రభాతవార్త :**
కరీంనగర్‌లో జరిగిన ఆలిండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ నేషనల్ లెవెల్‌లో శంకర్‌పల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సునీల్ కరాటేలో గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అతని ప్రతిభను గుర్తించి అభినందించారు. మరెన్నో మెడల్స్ సాధించాలని ప్రధానోపాధ్యాయులు విద్యార్థికి సూచించారు.

## వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలి

**షాబాద్, నవంబర్ 23, ప్రభాతవార్త :**
వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఎస్సై చందర్ నాయక్ తెలిపారు. బుధవారం సంకేపల్లిగూడ స్టేజీ వద్ద డీసీపీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య 8 బారికేట్లను పోలీసులకు అందజేశారు. ఆయనకు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు గురికాకుండా ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ఉన్న వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, ఓవర్ స్పీడ్ పోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ట్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం లాంటివి చట్ట విరుద్ధమన్నారు. అందరూ జాగ్రత్తగా వాహనాలు నడిపి ఇంటికి క్షేమంగా చేరుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు దేశమళ్ల ఆంజనేయులు, కుమ్మరి శ్రీనివాస్, మహేందర్‌గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.




న ంకేపల్లిగూడ స్టేజీ వద్ద భారికేట్లను ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

## అంబేద్కర్ రథయాత్ర ప్రారంభం



**తలకొండపల్లి నవంబర్23,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలల వేసి రాజ్యాంగ పరిషత్ ఆమోదం పొందినం సందర్భంగా రథయాత్రను సుధాకర్, రఘురాములు, డేవిడ్, కొమ్ము తిరుపతి, దర్వుల శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిన్నళ్ల డేవిడ్ ఆధ్వర్యంలో జరిగిన రథయాత్రలో కో ఆర్డినేటర్ సుధాకర్, టిపిఎస్‌జెఎసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము తిరుపతి, కుర్మ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగె వెంకటయ్య, మాజీ ఎంపిపి రఘురాములు, మీడియా నాయకులు జాతర జిల్లా అధ్యక్షు డు దుర్వుల శంకర్, మాజీ వార్డు సభ్యులు నర్సింహ్మా, విజయ్ కుమార్, సురేష్, బహుజన సేన జిల్లా అధికార ప్రతినిధి వర్కాల శేఖర్, వంశీ, రాంపూర్, మహేష్, కుమార్, వెంకటయ్య, నర్సింహ్మా, కేశవులు, కుమార్, శీను, మహేష్, సుధాకర్, పాల్గొన్నారు.

## వసతి గృహంలో ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్ నిద్ర



విద్యార్థులతో కలిసి నిద్రించిన ఎంపిపి

**తలకొండపల్లి నవంబర్23,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల కేంద్రంలో కేజీవిబి విద్యార్థుల సమస్యల తెలుసుకోవడం కోసం ఎంపిపి నిర్మల రాత్రి హాస్టల్ విద్యార్థులతో భోజనం చేసి అక్కడే నిద్రించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకుని పై అధికారులకు నివేదిక ఇస్తానని తెలిపారు. గతంలో కెజివిబి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా స్పందించి విద్యార్థుల సమస్యలు తీర్చాలని ఆమె కోరారు.

## మైనింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దు : తాండ్ర రవీందర్



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తాండ్ర రవీందర్, నాయకులు

**యాచారం, నవంబర్ 23 ప్రభాతవార్త**
యాచారం మండలంలో ఎలాంటి మైనింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దని బుధవారం బిజెపి మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఎంపిపి కొప్పు సుకన్య భాషా సమక్షంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మైనింగ్‌కు అనుమతి ఇవ్వవద్దని కోరగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనింగ్‌కు అనుమతి ఇవ వ్వడం లేదని, ఇదే విషయాన్ని గతంలో కూడా చెప్పానన్నారు. ఎవ రైనా ప్రయత్నం చేస్తే స్వయంగా నేనే వచ్చి మీకు మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కీజ్‌గూడ ఉపసర్పంచ్ పల పు నరేష్, ఉపాధ్యక్షులు పత్తి రాజు, నారిమళ్ల రమేష్, బిజెవైఎం ప్రధాన కార్య దర్శి సంగేం శ్రీనాధ్, బన్నే శివమోడీ, సపావత్ గణేష్ నాయక్, పల్లను విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యకాస జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి : అంజయ్య



వ్యకాస మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

**యాచారం, నవంబర్ 23 ప్రభాతవార్త**
ఈ నెల 29, 30 తేదీలలో కందుకూరులో జరిగే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం 11వ రంగారెడ్డి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి. అంజయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను ఆయన సంఘ కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు ప్రాధాన్యత ఉన్నందున కార్యకర్తలు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షుడు కె. శ్రీరాములు, మండల నాయకులు రాములు, జంగయ్య, అంజయ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## నేడు క్షేత్ర దినోత్సవ అవగాహన కార్యక్రమం : ఏవో సందీప్ కుమార్

**యాచారం, నవంబర్ 23 ప్రభాతవార్త**
మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలోని కాషమల్ల రాములు వ్యవసాయ క్షేత్రంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నేడు భాస్వరాన్ని కలిగించే బ్యాక్టీరియా, దఫదఫాలుగా ఎరువుల వాడకం, పచ్చిరొట్ట ఎరువులపై క్షేత్ర దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మండల వ్యవసాయాధికారి సందీప్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ కూలీలు అవగాహన సదస్సుకు హాజరు కావాలని కోరారు.

## ఘనంగా గ్రీన్ మేకర్స్ వ్యవస్థాపక దినోత్సవం

**ఆమనగల్లు, నవంబర్23, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల కేంద్రంలో బుధవారం గ్రీన్ మేకర్స్ అసోషియేషన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సంస్థ ప్రతినిధులు ఘనంగా జరుపుకున్నారు. 11వ వసంతంలోకి అడిగుడుతున్న సంధర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబ జన్మదినం పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణి చేశారు. అధ్యక్షుడు ఎమ్. శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన కార్యక్రమాలు కొనసాగగా, గౌరవ అధ్యక్షుడు ఎన్. మదన్‌గోపాల్(రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు) ముఖ్య అతిథిగా హాజరైనారు. కాగా అధ్యక్షులు ఎమ్. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రీన్‌మేకర్స్ అసోషియేషన్ ఏర్పాటు చేసి 11వసంతాలు పూర్తి చేసుకున్నదని, నాటి నుండి నేటి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోన మహమ్మారితో ఉపాధి కోల్పోయిన అనేక కుటుంబాలకు నిత్యవసర వస్తువులను, పేద విదార్థులకు అవసరమైన సామాగ్రిలను అందించినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పతాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజశేఖర్, మల్లేశ్, ఎన్. సతీష్, నర్సింహ్మా, లక్ష్మణ్, దినేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



. ఆసుపత్రిలో పూజలు చేస్తున్న గ్రీన్ మేకర్స్ అసోషియేషన్ ప్రతినిధులు

## పేద ప్రజల పెన్నిధి ముఖ్యమంత్రి కెసిఆర్

### -ఎమ్మెల్యే మంచిరెడ్డి



కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడి కిషన్‌రెడ్డి

**యాచారం, నవంబర్ 23 ప్రభాతవార్త**

యాచారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలానికి చెందిన 51 మంది లబ్దిదారులకు రూ. 51,05, 916 విలువ చేసే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథక చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సిఎం కెసిఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏ ప్రభుత్వం అమలు చేయని పథకాలు తెలంగాణ ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేసి మహిళా సాధికారతకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులంతా ఉపయోగించుకోవాలన్నారు. యాచారం మండలానికి ఇప్పటి వరకు రూ. 14.66 కోట్ల విలువ చేసే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొప్పు సుకన్య భాషా, జడ్పీటీసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, సర్పంచ్, ఎంపిటిసి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## అన్నదాన ప్రభువుకు సన్మానం



అన్నదాన ప్రభువును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**నందిగామ నవంబర్23,ప్రభాతవార్త :**

నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన ఎడ్ల వెంకటేష్ యాదవ్ బుధవారం అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వాములకు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నదాన ప్రభువు వెంకటేష్ యాదవ్‌ను ఆలయ కమిటీ నిర్వాహకులు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ...అయ్యప్ప కరుణ కృపా కటాక్షం అందరిపై ఉండాలని,ప్రజలందరికి మంచి జరగాలని అయ్యప్పను వెడుకున్నట్లు తెలిపారు.అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం తన పూర్వజన్మ సుకృతమన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మేకగూడ సింగిల్ విండో చైర్మన్,డిసిసిబి డైరెక్టర్ కంకంటి మంజులారెడ్డి,టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పద్మారెడ్డి,అప్పరెడ్డిగూడ సర్పంచ్ జే.కె నర్సింలు,ఆలయ కమిటీ సభ్యులు,స్వాములు సుదర్శన్ గౌడ్ ,హరిజీవన్,జంగయ్య ,కృష్ణ గౌడ్ ,ఉప సర్పంచ్ కుమార్ గౌడ్ ,మేకం రాజు ,శ్రీకాంత్ గౌడ్,తోట భాస్కర్ ,గోపాల్ ,కరువ యాదయ్య, కారున్య,మేకం శేఖర్,బి.కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## వైన్ షాపులో మద్యం బాటిళ్లు, రూ.50 వేలు నగదు అపహరణ



మద్యం బాటిళ్లు, నగదు, రూ.50 వేలు అపహరణకు గురైన వికారాబాద్ బాలాజీ వైన్స్,

**వికారాబాద్, నవంబర్ 23, ప్రభాతవార్త:**

వైన్ షాపులో మద్యం బాటిళ్లు, రూ.50 వేల నగదు దొంగిలించిన సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది.ఈ సంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలోని బాలాజీ వైన్స్ నిర్వాహకులు మంగళవారం రాత్రి వ్యాపారం ముగించుకొని వైన్స్ షాపు ు మూసి వెళ్లారు. తిరిగి మరుసటి రోజు బుధవారం ఉదయం షాపు తెరిచి చూడగా, దుకాణంలో ఉన్న వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి.దీంతో దొంగలు పడ్డారని నిర్ధారించుకున్న నిర్వాహకులు, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.స్థానిక పోలీసులు వచ్చి విచారణ చేయగా, మద్యం దుకాణంలో రూ.50 వేలు నగదు, సుమారు 2 లక్షల విలువైన మద్యం బాటిళ్లు దొంగిలించినట్లు వైన్ షాప్ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వికారాబాద్ సిఐ టంగుటూరి శ్రీ ు తెలిపారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

### -చిన్నారుల అలంకరణతో మురిసిన తల్లిదండ్రులు

### -పాఠశాలకు చేయూత అందిస్తాం : సర్పంచ్

**కుల్కచర్ల నవంబర్23,ప్రభాతవార్త :**

చిన్నారులు ఉపాధ్యాయులైన వేళ వారి అలంకరణలతో తల్లిదండ్రులు మురిసిపోయారు.బుధవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని పీరంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులే ఉపాధ్యాయులై పిల్లలకు పాఠాలు భోదించారు.ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన సర్పంచ్ రాధిక విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు.పాఠశాలకు కావలసిన మౌళిక సదుపాయాలు కలిస్తూ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా తగు చర్యలుతీసుకుంటామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్‌గా లోకేష్,పిఇటిగా సందీప్,వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులుగా అఖిల,చందన,వాణిశ్రీ,శ్రీవాణి,చైతన్య తదితర విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు పార్వతి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన విద్యను బోధించడంతో పాటు వారిలో నైపుణ్యాన్ని వెలికితీసే సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయులుగా చిన్నారులు

# బిసి శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలి

### - బిసీ సంఘం ఆద్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన

**తాండూరు, నవంబరు 23, ప్రభాతవార్త:**

బిసీ స్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని జాతీయ బిసీ సంఘం సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. తాండూరు పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనకాల ఉన్న బిసీ స్మశాన వాటికతో పాటు పాత తాండూరు బొనమ్మ గుడి వద్ద ఉన్న స్మశాన వాటిక, గొల్లచెరువులోని స్మశాన వాటికలను వెంటనే మున్సిపల్ ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తి అంగులతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బిసీ సంఘం కన్వీనర్ రాజ్‌కుమార్ నేతృత్వంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. స్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని, స్మశాన వాటికలో పిచ్చి మొక్కలను తొలగించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. కరోనా తరువాత దేశంలో స్మశాన వాటికలు వైకుంఠదామాలుగా బ్రంహ్మాండంగా పురోగతి చెందుతుంటే తాండూరులో ఉన్న బిసీ స్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోకపోవడం చాలా బాధాకరమని అన్నారు. బిసీ స్మశాన వాటికలకు నిధులు ఉన్నా.. టెండర్లు పిలిచిన కాంట్రాక్టర్లు రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి బిసీ స్మశాన వాటికల కోసం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పర్చాలని డిమాండ్ చేశారు. పట్టంలోని పోఈస్టేషన్ వెనకాల ఉన్న స్మశాన వాటికలో కుక్కలు, పందులు రాజ్యమేలుతున్నాయని, అక్కడే మూత్ర విసర్జన చేయడంతో ఆప్రాంతమంతా దుర్గంధంగా మారిందని అన్నారు. స్థానిక పోలీసులు కూడ ఈ స్మశాన వాటికపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం మున్సిపల్ మెనేజర్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మధులత, రాష్ట్ర నాయకులు సయ్యద్ షకూర్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పరమేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శ్రీకాంత్, వాల్మీకి సంఘం అధ్యక్షులు బద్రు, బిజేపీ తాండూరు నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, కౌన్సిలర్ బాలప్ప, రజక సంఘం నాయకులు పరమేష్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, వివిద కులసంఘాల నాయకులు బలరాం, హనుమంతు, శ్రీనివాస్, రాము, టైలర్ రమేష్, కిరణ్, బోయ రాధాకృష్ణ, తాండ్ర నరేష్, జుంటుపల్లి వెంకట్, అమ్రేష్, ఇందూర్ వెంకట్, గడ్డం వెంకటేష్, రోహిత్, బస్సు నియోజకవర్గ బీసీ అధ్యక్షురాలు జ్యోతి, ఉపాధ్యక్షురాలు అనిత, విజయలక్ష్మి, మంజుల, వివిద మండలాల అధ్యక్షులు లక్ష్మణచారి, నరేందర్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

# ఘనంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ

### -అయ్యప్ప నామస్మరణంతో మారుమోగిన కనకమామిడి

**మొయినాబాద్, నవంబర్ 23, ప్రభాతవార్త :**

కనకమామిడి గ్రామంలో అయ్యప్పస్వామి మహపడిపూజ ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులతో పూజా ప్రాంగణం నిండి పోయి అయ్యప్ప నామస్మరణంతో మారుమోగింది. బుధవారం మండలంలోని కనకమామిడి గ్రామంలో అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్ప స్వామి సన్నిదానంలో నిర్వహించిన పడిపూజలో శరణం అయ్యప్ప, స్వామియే శరణం అయ్యప్ప అంటూ కనకమామిడి గ్రామం మారుమోగింది, కనకమామిడి గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు గ్రామం నుండి పాదయాత్రగా శబరిమల నుండి తిరిగి వచ్చిన స్వాములు అందరు కలిసి గ్రామ సర్పంచ్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహపడిపూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు, ఈ పూజలో ముందుగా గణపతి హోమం, గణపతి పూజ, కుమారస్వామి పూజతో పాటు అయ్యప్ప స్వామికి పూజ నిర్వహించి పూల,పండ్లతో నూతనవస్త్రాలను, నైవేధ్యాన్ని స్వామి వారికి సమర్పించారు, అనంతరం భజన మండలి, గణేష్ బాల అంజనేయ భక్త సమాజ్, నరేందర్ స్వామి ఆలపించిన అయ్యప్ప పాటలతో మాలధరించిన అయ్యప్పస్వాములు, నృత్యాలతో ఆడుతూ, పాడుతూ, చప్పట్లతో భక్తి శ్రద్దలతో అయ్యప్పస్వామికి పూజా కార్యాక్రమాలు నిర్వహించారు, గ్రామంలోని భక్తులు, వారి బంధువులు, మాల ధరించిన అయ్యప్ప స్వాముల బంధుమిత్రులతో అయ్యప్ప నామస్మరణం మారుమోగింది, అయ్యప్ప స్వామి హరతి భక్తులకు ప్రత్యేకంగా నిలిచింది, అయ్యప్ప స్వామి హరతి అందుకున్న భక్తులు ఆయన దర్శనాన్ని అందుకున్నారు, అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు, భక్తి శ్రద్దలతో భక్తులు అయ్యప్ప స్వామి అన్నదాన కార్యక్రమంలో పాల్గోని అశీర్వాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాంరెడ్డి, వంశీదర్‌రెడ్డి, బలవంత్ రెడ్డి, బాలు, కేజిరెడ్డి ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్దులు, అయ్యప్ప స్వాములు, వారి బంధు మిత్రులు పాల్గోన్నారు,



# క్రీడా ప్రాంగణాల పనులను త్వరితగతిన పూర్తి చేయించాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



పూడూరు మండలం మీర్జాపూర్ గ్రామీణ క్రీడా ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ,ఆర్‌డిఓ కృష్ణన్ తదితరులు

**పూడూరు, నవంబర్ 23, ప్రభాతవార్త :**

పెండింగ్‌లో ఉన్న క్రీడా ప్రాంగణాల పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం పూడూరు మండలం పరిధిలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన పల్లె ప్రకృతివనం,నర్సరీ,తెలంగాణ గ్రామీణ క్రీడ ప్రాంగణం,తడిపొడి చెత్తను వేరుచేసే కేంద్రాన్ని ఆర్‌డిఓ కృష్ణన్‌తో కలిసి సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గ్రామీణక్రీడా ప్రాంగణంలో మొక్కలు నాటిన అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనంతోపాటు,ప్రణాళికాబద్దంగా విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం మన్నెగూడ గ్రామానికి చెందిన నర్సరీ, బృహత్ పల్లె ప్రకృతి వనాలను సందర్శించి కలుపు మొక్కలను తొలగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఉమాదేవి,డిఎల్పీఓ అనిత,ఎంపిఓ సుందర్ ఎపిఓరాములు,ఈసి అశోక్ ఆయా గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి సేవాట్రస్టు సభ్యుల సేవలు హర్షణీయం

### -టీబీ రోగులకు పౌష్టికాహార కిట్‌ల పంపిణీ

### -డిఎంఅండ్‌హెచ్‌ఓ పల్వన్‌కుమార్

**కొడంగల్,నవంబర్ 23ప్రభాతవార్త**

మానవ సేవే మాధవ సేవ అనే దృక్పధంతో సత్యసాయి సేవా ట్రస్టు సభ్యులు అందిస్తున్న సేవలు హర్షణీయమని జిల్లా వైద్యాధికారి(డిఎంఅండ్‌హెచ్‌ఓ) పల్వన్‌కుమార్ అన్నారు.సత్యసాయి 97వ జయంతిని పురస్కరించుకొని బుధవారం సత్యతసాయి సేవా సమితి సభ్యులు స్దానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హజరై టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్‌లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు టీబీ రోగులకు ముక్తి భారత్ పథకంలో భాగంగా ప్రభుత్వం ప్రతి నెల రూ.500 అందించడం జరుగుతుందని తెలిపారు.ప్రధానంగా టీబీ రోగులకు పౌష్టికాహరం అందిస్తే వారి ఆరోగ్యం త్వరగా మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు.సేవ భావంతో సత్యసాయి సేవా ట్రస్టు సభ్యులు టీబీ రోగులకు పౌష్టికాహరం కిట్‌లను అందించడం పట్ల ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్,డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ మాట్లాడుతు సమాజంలో టీబీ రోగుల పట్ల ఎవ్వరు చిన్న చూపు చూడరాదని,టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్‌లు అందించేందుకు దాతలు ముందుకు రావాలని అన్నారు.సత్యసాయి సేవా ట్రస్టు సభ్యులు తమ వంతుగా కిట్‌లను అందించడం అభినందనీయమన్నారు.అంతకుముందు ఆసుపత్రిలో సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి సాయిబాబా సేవలను కొనియాడారు.అనంతరం సభ్యులు శ్రీనివాస్‌యాదవ్,దశరత్‌లతో పాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టీబీ రోగులకు పౌష్టికాహార కిట్‌లను అందిస్తున్న జిల్లా వైద్యాధికారి

## ఘనంగా జాతీయ ఫార్మసీ వారోత్సవాలు

### - ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

### - ముఖ్యఅతిథులుగా తీగల కృష్ణారెడ్డి, ఇండియన్ ఫార్మసుటికల్ తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ కె.రాంప్రసాద్‌రెడ్డిలు హాజరు



**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్ 23, (ప్రభాతవార్త) :**

61వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని టీకేఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుచెన, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరతి, డాక్టర్ కళ్యాణి, సీహెచ్ ప్రదీప్‌కుమార్, ఇండియన్ ఫార్మసుటికల్ తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ కె.రాంప్రసాద్‌రెడ్డిలతో కలిసి కాలేజీ చైర్మన్ తీగల కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన కోరారు. ఒకరు రక్తదాం చేయడం వల్ల ముగ్గురు ప్రాణాలను నిలబెట్టవచ్చునని ఆయన అన్నారు. కరోనా కష్టకాలంలో రక్తదాన నిల్వలు ఎంతగానో ఉపయోగపడ్డాయని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. అదేవిధంగా ఇండియన్ ఫార్మసుటికల్ తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ కె.రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం ఇండియన్ రెడ్ క్రాస్ ద్వారా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వాహించి ఎంతో మందికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో తమ వంతుగా తోడ్పడుతున్నామని అన్నారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల ప్రాణాంతక తలసేమియా వ్యాధిగ్రస్థులకు జీవనాధారమని, రక్తదానం చేయడం వలన గుండెపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని, ఐరన్ శాతం క్రమబద్ధం చేయబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నర్సింహారెడ్డి, రెడ్‌క్రాస్ ట్రెజరర్ చల్లా రాఘవరెడ్డి, సీనియర్ రెడ్‌క్రాస్ యూత్ కన్వీనర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ధర్నాను విజయవంతం చేయాలి

**కొడంగల్/బొంరాస్‌పేట్,నవంబర్ 23ప్రభాతవార్త**

రైతు సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ధర్నాను విజయంతం చేయాలని కొడంగల్,బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్,నర్సిములుగౌడ్‌లు పిలుపునిచ్చారు. బుధవారం ఆయా మండల కేంద్రాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు పీసీసీ అధ్యక్షులు, ఎంపీ. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డిల ఆదేశాల మేరకు రాష్ట్రంలో రైతు సోదరులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల (ధరణీ,రైతు రుణమాఫీ,రైతు భీమా,పోడు భూములు,ధాన్యం,మిరప,పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించుట)ను పరిష్కరించి వారికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో గురువారం ఉదయం 10 గంటలకు ఆయా మండ ల కేంద్రాల్లో చేపట్టనున్న ధర్నా కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార ్యకర్తలు,రేవంత్ అభిమానులు,రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవతం చేయాలని వారు కోరారు.

## కోరికలు తీరాలంటే మహాపాదయాత్ర చేయాలి

### -గురుస్వామి సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో శబరికి పాదయాత్ర

**నాగారం నవంబర్23, ప్రభాతవార్త :** భక్తుల కోరికలు తీరాలంటే భక్తిశ్రద్దలతో శబరిమలకు మహాపాదయాత్ర చేయాలని గురుస్వామి సుశీల్ కుమార్ అన్నారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలో నుండి అయ్యప్ప దీక్షతో గురుస్వామి సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు స్వాములు శబరిమల అయ్యప్ప స్వామిదేవస్థానం వరకు మహాపాదయాత్రకు శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ర్యాలబాలు యాదవ్‌తో 11మంది స్వాములు సికింద్రాబాద్ వినాయక స్వామి దేవస్థానం నుండి 1200కిలోమీటర్ల దూరంలో ఉన్న కేరళ రాష్ట్రంలోని శబరిమలకు కాలినడకన బయలుదేరారు.స్వామియే శరణమయ్యప్ప అని నినాదిస్తూ 39 రోజులలో శబరిమల కొండలు చేరుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ర్యాల బాలు యాదవ్,శివ యాదవ్,టి.సాయినాథ్,అఖిల్,సునీల్,బి కార్తీక్,దినేష్, స్వాములు, పాదయాత్రలు పాల్గొన్నారు.



మహాపాదయాత్రలో పాల్గొన్న స్వాముల దృశ్యం

## సత్యసాయి బాబ బోధనలే నేటి సమాజానికి ఆదర్శం

### - బిజెపి నియోజకవర్గ ఇంఛార్జీ శ్రీవర్ధన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి, తదితరులు

**షాద్‌నగర్, నవంబర్ 23, (ప్రభాతవార్త) :**

సత్యసాయి బాబ బోధనలే నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జీ శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం సత్యసాయి బాబ 97వ జన్మదినోత్సవాన్ని పురస్కారించుకొని షాద్‌నగర్ పట్టణంలోని సత్యసాయిబాబా ఆలయంలో కన్వీనర్ వెంకటయ్య ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీవర్ధన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సత్యసాయిబాబ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే వాటిని ఆయుధాలుగా చేసుకొని ప్రేమతత్వాన్ని ప్రజల్లో నింపారన్నారు. వారు ఎంచుకున్న ఈ మార్గాలను ఈరోజుకు ప్రపంచంలోనే అనేక దేశాలు పాటిస్తున్నాయని అన్నారు. నేటి సమాజంలో మానవ సంబంధాలు మట్టి కలుస్తున్న సందర్భంలో వారి బోధనలు ప్రపంచ దేశాలలో అనేక మంది సాయి భక్తులు పాటిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి మహిళ కన్వీనర్ మాధవీలత, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వరలక్ష్మి, దామోదర్, తదితర భక్తులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



**మొయినాబాద్, నవంబర్ 23, ప్రభాతవార్త :**

మొయినాబాద్ మండల గీతాకార్మికుల ఆధ్వర్యంలో వచ్చేనెల డిసెంబర్ 9,10 తేదీల్లో మేడ్చల్ జిల్లాలో నిర్వహించనున్న గీతా కార్మికుల మహసభలకు వేలాదిగ తరలిరావాలని మొయినాబాద్ మండల సీపిఐ పార్టీ నాయకులు పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 65 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల కళ్ళుగీతా కార్మికుల హక్కుల కోరకు, ఉప్పెనలా గౌడ్ అన్నలు తరలిరావాలని పిలుపునిచ్చారు, ఒక్కప్పుడు రాష్ట్రానికి అధికంగా పన్నుచెల్లించి, రష్ట్ర కజాన కేవలం కల్లుగీతతోనే వచ్చేదని అన్నారు, ఎంతో మంది కల్లుగీత కార్మికులు ప్రమాదావశత్తు మరణించిన కనీసం పట్టించుకోని ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు, ప్రతి గ్రామం నుండి డిసెంబర్ 9,10 తేదిల్లో ప్రతి గ్రామం నుండి గౌడ్ అన్నలు, కల్లు పనివాళ్ల సంఘం, గౌడ్ అన్నలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఎం.సుదాకర్ గౌడ్, మహేష్ గౌడ్, మొయినాబాద్ మండల కార్యదర్శి రాజుగౌడ్, రామస్వామి గౌడ్, రవిందర్ గౌడ్, మొయినాబాద్ మండల సీపిఐ కార్యాదర్శి శ్రీనివాస్ తధితరులు పాల్గోన్నారు,

## సాయి తత్వం సమాజానికి హితం

### -సత్యసాయి బాబా జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొన ్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

**కొడంగల్,నవంబర్ 23 ప్రభాతవార్త**

ప్రజల్లో ప్రేమ తత్వాన్ని నింపిన సత్యసాయి బాబా తత్వం సమాజానికి హితం అని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.బుధవారం సత్యసాయి బాబా 97వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్ స్వగృహంలో సత్యసాయి బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హజరైన ఎమ్మెల్యే కౌన్సిలర్ దంపతులు మధుసుదన్‌యాదవ్,ఆర్.వాణీయాదవ్‌లు చేసిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ప్రతి ఒక్కరు సమాజ హితం కోసం సత్యసాయి తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట టీఆర్ఎస్ నాయకులు శివకుమార్‌గుప్త,విష్ణువర్ధన్‌రెడ్డి,చాంద్‌పాషా,రమేష్‌బాబు,నవాజోద్దిన్,సయ్యద్ అంజద్,నందారం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలు మృతిపై పలు అనుమానాలు

**బషీరాబాద్,నవంబర్ 23,ప్రభాతవార్త:**

కుట్రపూరితంగా ఆ వృద్దురాలిని హతమార్చి ఆపై నిప్పు పెట్టి ఉంటారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.బషీరాబాద్ మండల పరిధిలోని మైల్వార్ గ్రామంలో ముక్త శాంతమ్మ(67) అనే వృద్దురాలు సోమవారం రాత్రి సజీవ దహనమైన విషయం తెలిసిందే.ఈ క్రమంలో ఆమె మృతి పట్ల గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఆమె ఆత్మ హత్యకు ఎవరు సహకరించి ఉంటారని.ఈమెకు కిరోసిన్ ఎవరు ఇచ్చి ఉంటారు అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా అర లీటరు కిరోసిన్ తో ఆత్మహత్య చేసుకోవటం సాధ్యమా అనే ప్రశ్నకు సమాధానం అంతుచిక్కనిధి.

**ఎస్ఐ విద్యా చరణ్ రెడ్డి:** శాంతమ్మ మృతి వెనకాల ఎవరిదైనా హస్తం ఉందా..? లేక ఆమెనే ఆత్మహత్య చేసుకుందా అనే కోణంలో విచారణ చేపడతామని ఎస్ఐ పేర్కొన్నారు.మృతి జరిగిన స్థలంలో అర లీటర్ కిరోసిన్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.పి.ఎం.ఈ రిపోర్టు ఆధారంగా వివరాలు వెల్లడిస్తామన్నారు.